

## కానుకల లెక్కింపు ప్రారంభం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ గణన సోమవారం ప్రారంభమైంది. 32 రోజులకు సంబంధించి హుండీ కానుకల లెక్కింపు మొదలు పెట్టారు.



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి కృష్ణా జిల్లాకు చెందిన బి.రామకృష్ణ కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళాన్ని ఆలయ ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.



## మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం వెండి రథోత్సవం నిర్వహించింది. ముందుగా సహస్రదీపార్చాన సేవ చేపట్టింది.

## న్యూస్‌రీల్

### అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న అభ్యర్థులకు సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అబ్జర్వర్లతో కలసి ఆర్వో, కలెక్టర్ డాక్టర్ జి.సృజన గుర్తులను కేటాయించారు. ఈ స్థానం నుంచి మొత్తం 19మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి బీవై రామయ్య, టీడీపీ నుంచి బస్తిపాటి నాగరాజు, కాంగ్రెస్ నుంచి పీజీ రాంపుల్లయ్య యాదవ్, బీఎస్పీ నుంచి మంచాల లక్ష్మీనారాయణ బరిలో నిలిచారు. వీరు నలుగురు గుర్తింపు పొందిన పార్టీల నుంచి పోటీ చేస్తుండడంతో వారికి ఆయా పార్టీల గుర్తులను కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులకు కూడా గుర్తులను కేటాయించారు.

### నేడు ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జున రెడ్డి రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ(ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి మంగళవారం కర్నూలుకు రానున్నారని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. కర్నూలు శివారులోని కార్బైడ్ దగ్గర నిర్మిస్తున్న ఏపీఈఆర్‌సీ భవనం పురోగతిని పరిశీలిస్తారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆయన వస్తున్నారని తెలిపారు.

### ఆత్మకూరులో 46 డిగ్రీలు

కర్నూలు (అగ్రికల్చర్): భానుడి భగభగలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎండల తీవ్రత, వడగాడ్పులకు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఒకటి రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గత ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా సాయంత్రానికి అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల వాతావరణం చల్లగా ఉండేది. ఈసారి పొడి వాతావరణం ఉండటం వల్ల ఎండలు, వడగాడ్పుల తీవ్రత అధికమైంది. సోమవారం ఆత్మ కూరులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బనగానపల్లెలో 45.4, డోన్‌లో 45.4, కర్నూలులో 45.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఉన్నా యి. మరో మూడు నాలుగు రోజులు ఎండలు, వేడి గాలుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

### అక్రమ మద్యంపై ఉక్కుపాదం



సమీక్షిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్

కర్నూలు: మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశించారు. జిల్లాలో ఏడు సెబ్ స్టేషన్లు, ఏడు చెక్‌పోస్టులు, రెండు బార్డర్ మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయి. సోమవారం ఉదయం 11:30 నుంచి 12:40 గంటల వరకు చెక్‌పోస్టు అధికారులతో, సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల వరకు సెబ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం డంప్ చేసే అవకాశమున్నందున పక్కా సమాచారంతో దాడులు నిర్వహించాలన్నారు. బార్డర్ మొబైల్ పార్టీలతో చెక్‌పోస్టుల్లో పని చేస్తున్న సిబ్బంది తనిఖీలు విస్తృతం చేయాలని ఆదేశించారు. మద్యం, సారా రవాణాదారులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. కర్ణాటక రాష్ట్రంలో మే 7వ తేదీన ఎన్నికల నేపథ్యంలో 5వ తేదీ సాయంత్రం నుంచి జిల్లా సరిహద్దులోని 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బార్లు, మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలను మూసి వేయించాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, సీఐలు రాజేంద్రప్రసాద్, సోమశేఖర్, స్వర్ణలత, విన్నీలత, రామాంజనేయులు, నరసనాయుడు, భార్గవ రెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

# ఇక హోరాహోరీ!



కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో నంద్యాల ఎంపీ పోచా, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

సార్వత్రిక సమరంలో మరో అంకం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ తంతు ముగియడంతో బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరనే విషయం తెలిపోయింది. దీంతో అభ్యర్థులంతా ఇక ప్రచారపర్వంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ప్రచారానికి కేవలం 10 రోజులు మాత్రమే గడువుండటంతో వేగం పెంచారు. పార్టీల అధినేతల జిల్లా పర్యటనలతో వేసవి వేడి కంటే జిల్లా రాజకీయం వేడెక్కింది. మరోవైపు ప్రచార హడావుడిలోనే డబ్బు పంపిణీ కూడా పూర్తిచేసేందుకు అభ్యర్థులు ప్రణాళికలు రచించుకున్నారు. దీంతో జిల్లాలో ఏ పల్లె, ఏ వీధి చూసినా ఎన్నికల కోలాహలమే కన్పిస్తోంది.

**సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారు**

- సోమవారంతో పూర్తయిన నామినేషన్ల ఉపసంహరణ
- పార్లమెంట్ బరిలో 19మంది, అసెంబ్లీ బరిలో 121 మంది పోటీ
- అత్యధికంగా కర్నూలు అసెంబ్లీ బరిలో 25మంది, అత్యల్పంగా మంత్రాలయం బరిలో 8 మంది
- పోటీలోని అభ్యర్థులు తేలడంతో ఇక ప్రచారపర్వంపై పూర్తిస్థాయిలో దృష్టి
- ప్రచారానికి పదిరోజులే గడువు.. దీంతో ఇంటిల్లిపాదీ ప్రచారంలోనే..
- ఎంత ఖర్చయినా వెనుకాడొద్దని తమ్ముళ్లకు చంద్రబాబు ఆదేశం

సాక్షి ప్రతినిధి కర్నూలు: జిల్లాలో కర్నూలు పార్లమెంట్, 7 అసెంబ్లీ, పాణ్యం కలిపి 8 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 121 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 182 మంది నామినేషన్లు దాఖలు చేయగా 50 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 133 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇందులో 12 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో తుదిగా 121 మంది ఎన్నికల బరిలో నిలవనున్నారు. వీరిలో అత్యల్పంగా మంత్రాలయం నుంచి 8 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో ఉన్నారు. అత్యధికంగా కర్నూలు నుంచి 25మంది పోటీలో ఉన్నారు. ఎమ్మిగనూరు, ఆదోని నుంచి 10మంది చొప్పున తలపడుతున్నారు. పత్తికొండ నుంచి 9, ఆలూరు 12, కోడుమూరు(ఎస్సీ) నుంచి 14, పాణ్యం 15తో పాటు కర్నూలు పార్లమెంట్‌లో 19మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఒక్కో ఈవీఎం బ్యాలెట్‌లో అత్యధికంగా 16మంది అభ్యర్థులకు చోటు ఉంటుంది. దీంతో కర్నూలు పార్లమెంట్, కర్నూలు అసెంబ్లీకి 2 ఈవీఎంలు వాడాల్సి ఉంది. తక్కిన అన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో ఒక్కో ఈవీఎం ఉండనుంది. రెండు ఈవీఎంల ద్వారా ఎన్నికలు జరగడం జిల్లాలో ఇదే ప్రథమం.



కర్నూలులోని నరసింహారెడ్డి నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

**కర్నూలు అసెంబ్లీలో టీడీపీ పాట్లు**

కర్నూలు అసెంబ్లీలో టీడీపీ మైనార్టీ ఓట్లు చీల్చేందుకు కుట్రకు తెరలేపింది. వైఎస్సార్‌సీపీ మైనార్టీ అభ్యర్థి, ఐఏఎస్(రిటైర్డ్) అధికారి ఇంతియాజ్ బాషాకు టిక్కెట్ ఇచ్చింది. చదువుకున్న వ్యక్తి, మంచి పేరున్న ఇంతియాజ్‌కు టిక్కెట్ ఖరారు కావడంతోనే టీజీ క్యాంపు డీలా పడింది. మైనార్టీ ఓట్లు 1.10లక్షల దాకా ఉండటంతో దిక్కుతోచని స్థితికి చేరారు. పైగా టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో మైనార్టీ ఓట్లు పూర్తిగా దూరమయ్యాయనే భావనకు వచ్చి బీజేపీ నేతలను పూర్తిగా దూరం పెట్టారు. నామినేషన్‌తో పాటు ప్రచారంలో కూడా బీజేపీ అభ్యర్థులు, ఆ పార్టీ కండువా, జెండా ఎక్కడా కన్పించలేదు. చివరకు టీజీ వెంకటేశ్ బీజేపీలో ఉన్నా.. పత్రికలకు ఇచ్చిన యాడ్స్‌లో దీన్ని దూరంగా ఉంచారు. దీనిపై బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. దీంతోపాటు అసెంబ్లీ బరిలో 9మంది అభ్యర్థులతో ఇండిపెండెట్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మైనార్టీ అభ్యర్థి కలిపితే మొత్తం 10మంది మైనార్టీలు బరిలో ఉంటారు. గెలిచే పరిస్థితులు లేవు కాబట్టే టీజీ భరత్, టీజీ వెంకటేశ్ ఇలా వ్యవహరించారనే చర్చ నడుస్తోంది. బరిలోని వారందరికీ ఎన్నికల ఖర్చు తామే పెడతామని వారు చెప్పినట్లు తెలుస్తోంది.

**నామినేషన్ల వివరాలు ఇలా**

| నియోజకవర్గం | మొత్తం నామినేషన్లు | తిరస్కరణ | ఆమోదం | ఉపసంహరణ | బరిలోని అభ్యర్థులు |
|---|---|---|---|---|---|
| కర్నూలు పార్లమెంట్ | 27 | 7 | 20 | 1 | 19 |
| కర్నూలు | 40 | 13 | 27 | 2 | 25 |
| పాణ్యం | 23 | 9 | 15 | 1 | 14 |
| పత్తికొండ | 14 | 3 | 11 | 2 | 9 |
| కోడుమూరు(ఎస్సీ) | 21 | 5 | 16 | 2 | 14 |
| ఎమ్మిగనూరు | 15 | 5 | 10 | 0 | 10 |
| మంత్రాలయం | 12 | 2 | 10 | 2 | 8 |
| ఆదోని | 15 | 4 | 11 | 1 | 10 |
| ఆలూరు | 15 | 2 | 13 | 1 | 12 |
| మొత్తం | 182 | 50 | 133 | 12 | 121 |

**ప్రచార పర్వంపై దృష్టి**

నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇక ప్రచారపర్వంపై అంతా దృష్టి సారించారు. 10రోజులు మాత్రమే గడువుండటంతో అన్ని ప్రాంతాలు చుట్టొచ్చేలా ప్రణాళికలు రచించుకున్నారు. అభ్యర్థులే కాకుండా వారి బంధువులు కూడా ప్రచారబాధ్యతలు తీసుకున్నారు. పాణ్యంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, కుమార్తెలు, కుమారుడు అంతా ప్రచారం చేస్తున్నారు. కర్నూలులో కూడా ఇంతియాజ్‌తో పాటు కుటుంబసభ్యులు పాల్గొంటున్నారు. ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరుతో పాటు అన్ని స్థానాల్లో అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులను రప్పించారు. దూరప్రాంతాల్లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్న వారు, వివాహమై ఇతర ప్రాంతాల్లో ఉండేవారు అంతా ఎన్నికలు ముగిసే వరకూ ఆయా నియోజకవర్గాల్లో తిష్టవేసి ప్రచారం సాగిస్తున్నారు.

**మంచినీళ్లప్రాయంగా డబ్బులు ఖర్చు చేస్తున్న అభ్యర్థులు**



- కర్నూలు నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలు పంచాలని టీజీ భరత్ భావిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. చివరకు ఓట్లతో పనిలేకుండా కుటుంబానికి 5వేల–15వేల వరకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. తనకు సంబంధించిన వ్యాపారసంస్థల ఖాతాల నుంచి బ్యాంకు ద్వారా నగదు డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది.
- పత్తికొండలో కేఈ శ్యాంబాబు కూడా రూ.2వేలు పంచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.
- ఇతర నియోజకవర్గాల్లో కూడా ఓటుకు రూ.వెయ్యి, రూ.1500, రూ.2వేల చొప్పున పంచేందుకు టీడీపీ ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.
- కొన్ని నియోజకవర్గాల్లో ఓటుకు రూ.వెయ్యి పంచాలని టీడీపీ నేతలు భావించినా ఇప్పుడు ఓటమి తప్పదని తెలుస్తున్న తరుణంలో అన్ని నియోజకవర్గాల్లో ఓటుకు రూ.2వేలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చర్చ జరుగుతోంది.
- ఇప్పటికే ఓటుకు రూ. వెయ్యి చొప్పున లెక్కేసి టీడీపీ డబ్బు మూటలు పంపిణీ చేసిందని, తక్కిన మొత్తం అభ్యర్థులు భరించి ఓటర్లను డబ్బుతో కొనాలని సూచించినట్లు తెలుస్తోంది.
- ఆది, సోమవారాల్లో కర్నూలు, నంద్యాల జిల్లాలో పర్యటించిన చంద్రబాబు అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఈ సూచన చేసినట్లు టీడీపీ నేతల ద్వారా తెలిసింది.

**ఎదురుగాలి వీస్తోందనే ఆందోళనలో చంద్రబాబు**



ఆదివారం మంత్రాలయం, కోడుమూరు, సోమవారం డోన్, నందికొట్కూరు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటించారు. టీడీపీ ముఖ్యనేతలతో ఎన్నికలపై చర్చించారు. జగన్ సభలతో పోలిస్తే టీడీపీ సభలకు జనస్పందన అంతగా లేదని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ పార్టీకి ప్రతికూల పరిస్థితులను స్పష్టం చేస్తున్నాయని, ఇప్పుడున్న పరిస్థితుల్లో డబ్బు వెదజల్లడం మినహా మరో ఆయుధం మనవద్ద లేదని చెప్పినట్లు సమాచారం. గత 20 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో కేవలం నాలుగు అసెంబ్లీలు మాత్రమే టీడీపీ గెలిచిందని, 2019లో ఉనికి లేకుండా పోయిందని.. ఈ దఫా కూడా 3 స్థానాల్లో మాత్రమే టీడీపీ వైఎస్సార్‌సీపీకి పోటీ ఇస్తోందని సర్వేల ద్వారా తనకు తెలిసిందని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో కూడా గెలిచే పరిస్థితులు స్వల్పమని, మళ్లీ ఫ్యాన్ గాలికి కర్నూలు, నంద్యాలలో 2019 ఫలితాలే పునరావృతమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా

- పోలీసులను ఆదేశించిన జనరల్, పోలీసు అబ్జర్వర్లు



అబ్జర్వర్లతో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని జనరల్ అబ్జర్వర్లు జాఫర్ పీసీ, మీర్ తారిక్ అలీ, పోలీసు అబ్జర్వర్లు ఉమేష్‌కుమార్ పోలీసులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, డబ్బు పంపిణీకి అడ్డుకట్ట వేయడానికి తీసుకున్న చర్యలపై కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి ఎస్పీ జి.కృష్ణకాంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముందుగా అబ్జర్వర్లు నియోజకవర్గాల వారీగా వివరాలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణకు సంబంధించి పంచలింగాల, సుంకేసుల వద్ద, కర్ణాటకకు సంబంధించి మాధవరం, పెద్దహరివాణం, మార్లమడికి, బాపురం, క్షేత్రగుడి దగ్గర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటకలో మద్యం ధరలు తక్కువగా ఉండడంతో అక్కడి నుంచి రవాణా అధికంగా జరుగుతోందన్నారు. 2023 డిసెంబర్ 23వ తేదీ వరకు రూ. 1.30 కోట్ల మద్యం, 2024 మార్చి 16 నుంచి ఏప్రిల్ 22వ తేదీ వరకు రూ. 2.18 కోట్ల మద్యంను సీజ్ చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనే లిక్కర్ సీజ్ అధికంగా చేసిన జిల్లాల్లో కర్నూలు ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. నగదు రూపంలో 2023 డిసెంబర్ 26 నుంచి 2024 మార్చి 15వ తేదీ వరకు రూ. 3.33 కోట్లు, మార్చి 16నుంచి ఏప్రిల్ 28వ తేదీ వరకు 62 లక్షల రూపాయలను సీజ్ చేసినట్లు చెప్పారు. 2023 డిసెంబర్ 26 నుంచి 2024 మార్చి 15వ తేదీ వరకు రూ.3.10 కోట్ల విలువ చేసే బంగారం, వెండి, మార్చి16 నుంచి ఏప్రిల్ 28వ తేదీ వరకు రూ.50లక్షల విలువ చేసే బంగారు, వెండిలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే రూ.24 వేల విలువ చేసే చీరలు, టీషర్టులు, టీపీలు, స్టిక్కర్లు, పాంప్లేట్లు, పార్టీ బ్యాగులు, పార్టీ స్కార్ఫ్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా గ్రామ పర్యటనలు, పల్లె నిద్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

**స్ట్రాంగ్‌రూమ్‌లు..కౌంటింగ్ హాళ్ల పరిశీలన**

రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్లు జాఫర్ పీసీ, మీర్ తారిక్ అలీ, కర్నూలు పార్లమెంట్ కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాల, పత్తికొండ, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల పోలీసు అబ్జర్వర్ ఉమేష్‌కుమార్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమాలపై అబ్జర్వర్లకు ఫిర్యాదు చేయండి

కర్నూలు(సెంట్రల్): పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్లను నియమించింది. కర్నూలు పార్లమెంట్‌తోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్, వ్యయపరిశీలకులను నియమించింది. ఈక్రమంలో ఎక్కడైనా ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నా...డబ్బులు పంచుతున్నా.. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నా వారిని నేరుగాకాని లేదా ఫోన్‌లోని సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు.

| నియోజకవర్గం | జనరల్ అబ్జర్వర్ | అడ్రస్ | సెల్‌ఫోన్, వాట్సాప్ నంబర్ |
|---|---|---|---|
| కర్నూలు పార్లమెంట్ | పీసీ జాఫర్ | రూమ్ నంబర్ 1, రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం, కర్నూలు | 6300932374 సంప్రదించు వేళలు : మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు |
| కర్నూలు,కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం | పీసీ జాఫర్ | రూమ్ నంబర్ 1, రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం, కర్నూలు | 6300932374 సంప్రదించు వేళలు : మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు |
| పత్తికొండ, ఆదోని, పాణ్యం, ఆలూరు | మీర్ తారిక్ అలీ | రూమ్ నంబర్ 2, రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం, కర్నూలు | 6300924829 |

## పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఇవే..

కర్నూలు(సెంట్రల్): పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు. ఆయా కేంద్రాల్లో మే 5 నుంచి 8వ తేదీ వరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు(ఫామ్–12)తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. అలాగే అత్యవసర సేవలకు సంబంధించి ఓటర్ల కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీరు మే 6నుంచి 8వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

**ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలు..**

| నియోజకవర్గం | ఫెసిలిటేషన్ ఏర్పాటు చేసే పాఠశాల పేరు |
|---|---|
| కర్నూలు | ఇందిరాగాంధీ మెమోరియల్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, కర్నూలు |
| పాణ్యం | గవర్నమెంట్ హైస్కూలు ఫర్ బాయ్స్, బీక్యాంపు,కర్నూలు |
| పత్తికొండ | గవర్నమెంట్ హైస్కూలు, పత్తికొండ |
| కోడుమూరు | గవర్నమెంట్ టౌన్‌మోడల్ హైస్కూలు, నియర్ కోట్ల సర్కిల్, కర్నూలు |
| ఎమ్మిగనూరు | ఎంపీడీఓ ఆఫీసు మీటింగ్ హాలు, ఎమ్మిగనూరు |
| మంత్రాలయం | జెడ్పీ హైస్కూలు, మంత్రాలయం |
| ఆదోని | నెహ్రూ మెమోరియల్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, మునిసిపల్ గ్రౌండ్, ఆదోని |
| ఆలూరు | గవర్నమెంట్ బాయ్స్ హై స్కూలు 2, అంబేద్కర్ సర్కిల్, ఆలూరు |

## వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

ఆలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని అడ్డుకునే శక్తి టీడీపీకి లేదని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి, కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, హిందూపురం ఎంపీ గోరంట్లమాధవ్ అన్నారు. హాలహర్వి మండలం టి.చాకిబండ, కొక్కెరచేడు, మిదేహాళ్, హాలహర్వి గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో రూపొందించారన్నారు. టీడీపీ హయాంకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను చూడాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అవినీతి పెచ్చురిల్లుతుందని, అక్రమాలు పెరిగిపోతాయని, పేదలకు సంక్షేమ పథకాలు అందబోవని వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి సమక్షంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కురుబ సంఘం నాయకురాలు శశికళ, కృష్ణమోహన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్దన్‌నాయుడు, పార్టీ నాయకుడు మారయ్య, ఎంపీపీ నెట్టకంటమ్మ, వైస్ ఎంపీపీ నాగేస్, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు, మల్లికార్జున, విక్రాంత్ రెడ్డి, రవిరెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.



చాకిబండ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్

# కేఈ కుటుంబీకుల ఊసెత్తని చంద్రబాబు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేఈ వర్గీయులు
- బ్యానర్ల ప్రదర్శనలో కూడా ధర్మవరం సుబ్బారెడ్డిదే ఆధిపత్యం
- చంద్రబాబు వేదికపై కన్పించని జనసేన, బీజేపీ నాయకులు
- మద్యం మత్తులోతూలిన తమ్ముళ్లు
- కూలీ డబ్బుల కోసం టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద పడిగాపులు కాసిన మహిళలు


వేదికపై శబరి, బాబు, సుబ్బారెడ్డి ఉన్న జెండాను ప్రదర్శిస్తున్న అనుచరులు

డోన్: మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి సోదరుల ప్రస్తావన లేకుండనే డోన్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ప్రచారం కొనసాగడంతో కేఈ వర్గీయుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పార్టీకి డోన్ కంచుకోటగా నిలిపిన తమ నాయకుల పేర్లను ఒక్కసారిగా కూడా చంద్రబాబు గుర్తు చేయక పోవడం తమను ఎంతగానో బాధించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేఈ కుటుంబీకుల సూచన మేరకు పార్టీ అభ్యర్థి విజయం కోసం అహర్నిషలు కృషి చేస్తున్న తమ కష్టానికి ప్రతి ఫలం ఇదేనా అని కేఈ వర్గీయులు చంద్రబాబు తీరును ప్రశ్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి కార్యక్రమం మొదలు పెట్టినప్పటి నుంచి సభికులకు అభివాదం చేస్తూ అన్ని తానై నిలిచారు. చివరకు చంద్రబాబు కూడా కోట్ల గెలుపు సుబ్బారెడ్డి గెలుపు అని అనడంతో ఇన్నాళ్లు పార్టీ అభివృద్ధి కోసం తాము పడిన శ్రమను చంద్రబాబు గుర్తించుకోక పోవడం ఏమిటని కేఈ వర్గీలు ఆవేదన వ్యక్తం చేశారు.

**మనిషికి రూ. 200 కూలి**

చంద్రబాబు సభకు జన స్పందన లేకపోవడంతో అప్పటికప్పుడు స్థానిక నా యకు లు పట్టణంలోని వార్డుల నుంచి ఒక్కొక్కరికి రూ. 200 కూలి చొప్పున చెప్పి మహిళలను తరలించారు. ఆయా వార్డు నాయకులకు డబ్బులు ముట్టజెప్పారు. అయితే సభ ముగిసి రెండు, మూడు గంటలైనా డబ్బులు చెల్లించకపోవడంతో ఆయా వార్డు నాయకుల ఇళ్ల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో గుమి కూడారు. కొన్ని చోట్ల కూలి డబ్బుల కోసం వాదులాటకు దిగడం కనిపించింది. జనాన్ని రప్పించేందుకు టీడీపీ నాయకులు పెద్ద మొత్తంలో కర్ణాటక అక్రమ మద్యాన్ని పంపిణీ చేశారు.




గిరగిరా తిరగాలి ఫ్యాను: ఆదోని పట్టణం వడ్డేగేరిలో ప్రజలతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి


అభివృద్ధే మా అజెండా: బేతంచెర్ల పట్టణంలో ఓటర్లతో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి


మేని'ఫెస్టివల్': బనగానపల్లె మండలం నందవరంలో మేనిఫెస్టో ప్రతులను చూపుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి జయమ్మ


ఆదరించండి: పెండేకల్లులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులు మధుసూదనరెడ్డి, రమ్య, సంధ్య


సామాన్యుడి జెండా: మహానంది మండలం మసీదుపురంలో ప్రజల చేతుల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు


చేరికల వెల్లువ: బండిఆత్మకూరులో పార్టీలో చేరినవారితో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి


దీవించండి: ఎమ్మిగనూరు పట్టణం 27వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కోడలు బుట్టా సాహితి


ఇంటి వద్దకే పాలన తీసుకొచ్చాం: ఆస్పరి మండలం జిణిగేరిలో ప్రచారం నిర్వహిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి తనయుడు చంద్రశేఖర్

## సకుటుంబ సమేతంగా..

ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ దూసుకుపోతోంది. ఎమ్మెల్యే అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రచారంలో ప్రజల నుంచి విశేషస్పందన వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో యువకులు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. అధికార పార్టీకి మద్దతు ప్రకటిస్తూ వీధివీధినా తిరుగుతున్నారు. పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ జెండాలను చేతపట్టుకుని తమ మనోగతాన్ని రెపరెపలాడిస్తున్నారు. –సాక్షినెట్‌వర్క్


అవ్వా ఆశీర్వదించాలి: శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి అల్లుడు సిద్ధార్థరెడ్డి


మంచిని గెలిపించండి: కర్నూలు మండలం బి. తాండ్రపాడులో ప్రచారం చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ సతీమణి స్టెల్లా సతీష్


మహిళల అభ్యున్నతే లక్ష్యం: నంద్యాల పట్టణం 23వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి సతీమణి నాగిని రవిసింగారెడ్డి


సంక్షేమానికి ఓటెత్తండి: కౌతాళం మండలం బదినేహాల్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి


యువోత్సాహం: పాణ్యంలో యువకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు శివనరసింహారెడ్డి

## 'మణప్పురం'కు మొట్టికాయ

- బాధితుడికి రూ.లక్ష ఇవ్వాలి
- వినియోగదారుల కమిషన్ తీర్పు

కర్నూలు (లీగల్) : మణప్పురం ఫైనాన్స్ సంస్థకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మొట్టికాయ వేసింది. బంగారు నగలను కుదువపెట్టి రుణం తీసుకున్న వారికి సమాచారం ఇవ్వకుండా నగలను వేలం వేయడాన్ని తప్పుబట్టింది. ఫిర్యాదుదారు కర్నూలు జిల్లా నివాసి అయితే అనంతపురం జిల్లాలోని దినపత్రికలో వేలం నోటీసు ప్రకటన ఇచ్చామన్న మణప్పురం వాదనను కమిషన్ తప్పుబట్టింది. నగలు వేలం వేసే ముందు సమాచారం ఇవ్వలేదని, సహజ న్యాయ సూత్రాలకు ఇది విరుద్ధమని తేల్చి చెప్పింది. ఇందుకు పరిహారంగా బాధితుడికి రూ.లక్ష చెల్లించాలని, అలాగే కోర్టు ఖర్చులకు మరో రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెందిన శంఖం రాజగోపాల్‌రెడ్డి రూ.1.87 లక్షల విలువైన నాలుగున్నర తులాల బంగారాన్ని కుదువపెట్టి మణప్పురం ఫైనాన్స్‌లో 2018 జూన్‌లో రూ.85 వేలు రుణం తీసుకున్నారు. అయితే రాజగోపాల్‌రెడ్డికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మణప్పురం ఫైనాన్స్ అధికారులు బంగారాన్ని వేలం వేశారు. అయితే రుణం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని రాజగోపాల్‌రెడ్డి మణ ప్పురం అధికారులకు తెలియజేయగా... గత రెండేళ్ల క్రితమే కుదువ బంగారాన్ని వేలం వేశామని తెలిపారు. రుణం పోగా రూ.14 వేలు చెల్లిస్తున్నామ ంటూ గడువు తీరిన చెక్కును రాజగోపాల్‌రెడ్డికి పంపారు. దీంతో రాజగోపాల్‌రెడ్డి గత ఏడాది ఆగస్టు లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.

- చంద్రబాబు తీరుపై విరుచుకుపడుతున్న అవ్వాతాతలు, ఇతర పింఛన్‌దారులు

## బాబూ..మాకెందుకీ కష్టాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఠంచన్‌గా ఒకటో తేదీన ఇంటి వద్ద పింఛన్ అందకుండా చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుపై వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మండిపడుతున్నారు. తమకెందుకు ఇన్ని కష్టాలు తెచ్చిపెట్టారంటూ అంటూ శాపనార్థాలు పెడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మే నెలకు సంబంధించి 4,68,742 సామాజిక భద్రత పింఛన్‌లు ఉన్నాయి. ఈ పింఛన్లకు మొత్తంగా రూ.139.82 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. మొత్తం పింఛన్‌లలో 75 శాతం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పింఛన్ నగదు బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని నిర్ణయించారు. ఇది ఒక్క నెల కూడా సక్సెస్ కాలేదు. ఒక్క నెలకే పింఛన్‌దారులు గగ్గోలు పెట్టడంతో వెంటనే మాన్యువల్‌గా పంపిణీ చేయడం మొదలు పెట్టారు. మళ్లీ ఇప్పుడు పచ్చ బ్యాచ్ దుష్ట పన్నాగం కారణంగా అవ్వాతాతలు, వ్యాధిగ్రస్తులు, ఇతర పించన్‌దారులకు కష్టాలు వచ్చి పడ్డాయి. వలంటీర్ల ద్వారా ఇంటి దగ్గరే పింఛన్ పొందుతూ చంద్రబాబు పాలనలో పడిన కష్టాలు మరచిపోయారు. మళ్లీ ఏప్రిల్ నెల నుంచి టీడీపీ గ్యాంగ్ కారణంగా సమస్యల వలయంలో చిక్కుకున్నారు. పింఛన్ పొందడంలో ఉత్పన్నమైన కష్టాలకు కర్త, కర్మ, క్రియ మొత్తం చంద్రబాబే అన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. అయితే ఈ నెపాన్ని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంపైకి నెట్టి చంద్రబాబుకు మేలు చేసేందుకు పచ్చ మీడియా చేస్తున్న హడావుడి అంతా, ఇంతా కాదు. డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేసినా అవ్వాతాతలు, ఇతర పించన్‌దారులు నగదు కోసం బ్యాంకులకు వెళ్లాల్సిందే. నగదు కోసం ఓచర్ రాయాల్సి ఉంది. నగదు కోసం బ్యాంకుల్లో గంటల తరబడి వేచి ఉండాల్సి ఉంది. అంటే డీబీటీ ద్వారా కూడా పించన్‌దారులను కష్టాల్లోకి నెట్టినట్లే.. అవ్వాతాతలు, ఇతర పించన్‌దారులకు కష్టాలు ఉత్పన్నం కావడానికి చంద్రబాబు గ్యాంగ్ కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**డోర్ టు డోర్ పంపిణీ...**

కర్నూలు జిల్లాలో 2,46,340 పింఛన్లు పంపిణీ చేయడానికి రూ.73,74,49,500 విడుదలయ్యాయి. ఇందులో 54,244 మందికి ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నారు. మిగిలిన 1,88,096 మందికి డీబీటీ ద్వారా నగదు బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. నంద్యాల జిల్లాలో 2,22,402 పింఛన్ల పంపిణీకి రూ.66,08,47,000 విడుదలయ్యాయి. ఇందులో 51,187 మందికి ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారు. మిగిలిన 1,71,215 మందికి నగదును డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు విడుదల చేస్తారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1,05,431 పింఛన్లను డోర్ టు డోర్ పంపిణీ చేస్తుండగా...3,59,311 పింఛన్లను డీబీటీ ద్వారా నగదు బదిలీ చేయనున్నారు. డోర్ టు డోర్ పంపిణీ చేసే పింఛన్‌లకు సంబంధించి నగదును మంగళవారం బ్యాంకుల నుంచి సచివాలయం సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేసి మే నెల 1వ తేదీ పంపిణీ చేస్తారు. డోర్ టు డోర్ పింఛన్ పొందే వారిలో దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులై వీల్‌చైర్‌కు, బెడ్‌కు పరిమితమైన వారు, సైనిక్ వెల్ఫేర్ పింఛన్‌దారులున్నారు.



## కార్మికుల పనివేళలను రీ షెడ్యూల్ చేయాలి

- కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు అధికంగా ఉన్నందున వివిధ రంగా ల్లో పనిచేస్తున్న ఉద్యోగులు/ కార్మికుల పని వేళలను రీ షెడ్యూల్ చేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కే వెంకటేశ్వర్లు కోరారు. రోజు వారీ, భవన నిర్మాణ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల రక్షణకు ఇటుకల బట్టీలు, దుకాణాలు,సంస్థలు, పరిశ్రమల యజమానులకు పలు మార్గదర్శకాలు, సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. పని ప్రదేశాల్లో అవసరాల మేరకు మంచి నీటి సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు అత్యవసర ఐస్ ప్యాక్స్ అందించాలన్నారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్మిక శాఖ కమిషనర్ జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ప్రతి ఒక్క యజమాని పాటించాలన్నారు. కార్మికులకు ఉపశమనం కల్పించే కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు.

**ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ**

కర్నూలు(అగ్రికల్చర్):కెనరా బ్యాంకు గ్రామీ ణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూ లు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు చదవడం, రాయడం వచ్చిన యు వతకు మే నెల 20వ తేదీ నుంచి 30 రోజుల పాటు శిక్షణనిస్తామన్నారు. ఈ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 6304491236నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## అమర జవాన్ల స్థూపం నిర్మించాలి

- మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య

కర్నూలు(అర్బన్): యుద్ధంలో అమరులైన జవాన్ల జ్ఞాపకార్థం జిల్లా కేంద్రంలో స్థూపం నిర్మించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థూపం నిర్మాణం కోసం గత దశాబ్దకాలంగా సంబంధిత అధికారులు, రాజకీయ నేతలకు పలుమార్లు వినతి పత్రాలు అందించినా, ఎలాంటి ఫలితం కనిపించడం లేదన్నారు. జిల్లా కేంద్రంలోని అనేక సెంటర్లలో విగ్రహాలు పెడుతున్నారు కానీ, అమర వీరుల స్థూపం మాత్రం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. చిత్తూరు జిల్లాలో మాత్రం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అమర జవాన్లకు స్థూపం నిర్మించారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మిలిటరీ ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలం కేటాయించారు కానీ, ఆసుపత్రి భవన నిర్మాణాలు జరగలేదన్నారు. కర్నూలు నగరంలో మాజీ సైనికులు ఆరు వేల మంది ఉన్నారని, వారిలో 70 సంవత్సరాలు దాటిన వారు చాలా మంది ఉన్నారన్నారు. వీరికి ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. నగరంలో అనేక కార్పొరేట్ హాస్పిటల్స్ ఉన్నా, మాజీ సైనికులకు వైద్యం అందించేందుకు ఎవరు దరఖాస్తు చేసుకోవడం లేదన్నారు. గౌరీ గోపాల్ హాస్పిటల్‌కు మంజూరు వచ్చినా వారు కూడా రద్దు చేసుకున్నారన్నారు. మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

## వడదెబ్బ నివారణకు గొడుగులతో ర్యాలీ


గొడుగులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామంలో గొడుగులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాస్ మీడియా అధికారిణి ప్రమీలమ్మ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఉద యం 10 గంటల్లోపు తమ పనులు ముగించుకుని నీడగల ప్రదేశాలలో ఉండాలని సూచించారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలన్నారు. వెంట నీళ్ల బాటిల్ ఉంచుకుని గంట గంటకు నీళ్లు తాగాలన్నారు. అనంతరం వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మంజూష, డాక్టర్ విజయ మాదురి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఈఈవో శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈవో మక్బూల్, పీహెచ్‌ఎన్ నిర్మలాదేవి, సూపర్‌వైజర్ దానమ్మ, సీహెచ్‌వోలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.